సాక్షి
హనుమకొండ
ఆదివారం । 23 । జూలై । 2023



సిబ్బంది సంక్షేమానికి కృషి
పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని, వారికి నిరంతరం అందుబాటులో ఉంటానని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. -8లో▸



ప్రవాహ.. పరవళ్లు
గోదావరి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి ప్రాణహితతోపాటు వర్షాలు తోడు కావడంతో కాళేశ్వరం బ్యారేజీలు నీటితో కళకళలాడుతున్నాయి. -8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0 / 24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అయి ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లుల నుంచి ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు 'గురు వందనం'

విద్యారణ్యపురి: ఈనెల 23న టీపీయూఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణిమ సందర్భంగా 'గురు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. హనుమకొండలోని సామ జగన్మోహన్‌రెడ్డి మెమోరియల్ హాల్‌లో నిర్వహించే ఈకార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు ఏవీఎన్ రెడ్డి, ప్రధాన వక్తగా జాతీయ వాద రచయిత, వ్యాసకర్త, కాలమిస్ట్ భాస్కరయోగి, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి, హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, వరంగల్ డీఈఓ డి.వాసంతి, టీపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిదురాల సుధాకర్, గౌరవ అధ్యక్షులు పిన్నింటి బాలాజీరావు, మాచర్ల భిక్షపతి పాల్గొంటారని టీపీయూఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, వెంకటరమణ, బత్తిని వీరస్వామి, ఉప్పుల సతీశ్ శనివారం తెలిపారు.

'ఓపెన్' డిగ్రీ అడ్మిషన్లు

వరంగల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్య సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వరంగల్‌లోని సీకేఎం కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఏ.ధర్మారెడ్డి, ప్రిన్సిపాల్ జి.శశిధర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండేళ్ల ఐటీఐ/డిప్లొమా పూర్తి చేసి జూలై 31వ తేదీలోపు braouonline.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సంబంధిత సర్టిఫికెట్లతో సహాయ కేంద్రానికి వచ్చి వెరిఫికేషన్ చేసుకొని నిర్ధారించిన ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి అడ్మిషన్ పొందాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్టడీ సెంటర్ లేదా 73829 29618 నంబర్‌ని సంప్రదించాలని పేర్కొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' లక్కీ డ్రా



కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా ఒకటవ, 5వ తరగతిలో ప్రవేశాలకుగాను విద్యార్థుల ఎంపికకు శనివారం లక్కీడీ డ్రా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ద్వారా ఒకటో తరగతిలో 88 మందిని, 5వ తరగతిలో 87 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నిర్మల, డిప్యూటీ డీఈఓ, గురుకుల విద్యాలయాల కన్వీనర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇన్‌స్పైర్ నామినేషన్లపై ఓరియంటేషన్

విద్యారణ్యపురి: ఈనెల 24వ తేదీన మధ్యాహ్నం 2.15 గంటలకు ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల నామినేషన్‌కు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై శనివారం తెలిపారు. రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్.సీ.ఈ.ఆర్.టీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో గణితం, సైన్స్ విభాగ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు 2023–24 సంవత్సరానికి నామినేషన్లు స్వీకరించనున్నట్లు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సైన్స్ లేదా గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు జూమ్ మీటింగ్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పల్లె సృజన, నవం ఫౌండేషన్ సభ్యులు పాల్గొని ప్రాజెక్టుల రూపకల్పనపై అమూల్యమైన సలహాలు సూచనలిస్తారని తెలిపారు. నామినేషన్లకు గడువు ఆగస్టు 31 అని, ప్రధానోపాధ్యాయులు నామినేషన్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామిని సంప్రదించాలని డీఈఓ సూచించారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు



హసన్‌పర్తి: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా జ్యుడీషియల్ మొదటి శ్రేణి న్యాయమూర్తి శాంతి సోని హెచ్చరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. శాంతి సోని ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ర్యాగింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. సదస్సులో పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సై సురేశ్, ఆత్మ చైర్మన్ చంద్రమోహన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్, మార్కెట్ డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం



ఈ ఫొటోలో కనిపిస్తున్న తల్లీకూతురు మడికొండ హేమ, ఆకాంక్ష మూడు రోజుల క్రితం విషజ్వరాల బారిన పడ్డారు. పరకాల సివిల్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. జ్వరాలతో పాటు విరేచనాలు కావడంతో ఆస్పత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. దగ్గరి బంధువులు వీరికి సేవలందిస్తున్నారు. కాగా, తాము నివసించే పరకాల పట్టణంలోని సీఎస్ఐ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని హేమ, ఆకాంక్ష 'సాక్షి'తో పేర్కొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న జ్వరపీడితులు

- ఆస్పత్రులకు పరుగులు పెడుతున్న రోగులు
- రెండు నెలల్లో ఓపీలో మూడు వేల మందికి చికిత్స
- ఆరు డెంగీ, ఐదు మలేరియా కేసులు నమోదు
- అస్తవ్యస్త డ్రెయినేజీలు, ఫాగింగ్ చేయకపోవడమే కారణం



పరకాల 14వ వార్డులోని వడ్ల వాడలో రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు



కమలాపూర్ : మురుగు, వర్షపు నీటిలో సంచరిస్తున్న పందులు

ఎంజీఎం/పరకాల/కమలాపూర్ : వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఓ వైపు గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె, మరోవైపు నాలుగైదు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. జనావాసాల మధ్య మురుగు నీరు నిలిచి దోమల వ్యాప్తి పెరుగుతోంది. అస్తవ్యస్తమైన డ్రెయినేజీలతోపాటు పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం, దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో జిల్లాలో అనేక మంది విషజ్వరాల బారిన పడుతున్నారు. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. జూన్, జూలైలో ఇప్పటి వరకు సుమారు 3 వేల మంది ప్రభుత్వాస్పత్రుల్లోని ఓపీ విభాగాల్లో చికిత్స పొందినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అనధికారికంగా ప్రైవేట్ ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తూ చికిత్స పొందిన వారి సంఖ్య రెట్టింపుగానే ఉంటుంది. కాగా, ప్రస్తుతం జ్వరాలతో బాధపడుతున్న వారు ఓపీ విభాగం ద్వారా చికిత్స పొందడంతో ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోందని, అడ్మిట్ అయ్యేవారి సంఖ్య తక్కువగా ఉంటోందని వైద్యులు పేర్కొంటున్నారు.

జనవరి నుంచి 28 డెంగీ, 9 మలేరియా కేసులు

హనుమకొండ జిల్లాలో మలేరియా, డెంగీ కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నాయి. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది, వైద్యులు అప్రమత్తంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జనవరి నుంచి జూలై 20 వరకు 28 డెంగీ కేసులు, 9 మలేరియా కేసులు నమోదయ్యాయి. కాగా, జూన్‌లో మలేరియా 1, డెంగీ 5 కేసులు, జూలైలో మలేరియా 4, డెంగీ ఒక కేసు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటితో పాటు మరికొన్ని కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆత్మకూరు, దామెర, ధర్మసాగర్, కమలాపూర్, రాయపర్తి(పి), పరకాల వంటి ప్రాంతాల్లో మలేరియా ఒకటి, డెంగీ రెండు కేసుల చొప్పున నమోదైనట్లు అధికారులు గుర్తించారు. వడ్డేపల్లి, పెద్దమ్మగడ్డ, న్యూశాయంపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా, డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

పరకాల సివిల్ ఆస్పత్రిలో రెట్టింపైన ఓపీ

పరకాల సివిల్ ఆస్పత్రిలో రోజువారీ ఓపీ ఒక్కసారిగా రెట్టింపైంది. గతంలో 100 వరకు రాగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 200 వరకు పెరిగింది. వీరిలో రోజుకు 10 మందికిపైగా ఆస్పత్రిలో చేరుతున్నారని వైద్యులు తెలిపారు.

సాక్షి ఫోకస్

ఇళ్ల మధ్య మురుగు నీరు..



కమలాపూర్‌లోని ఒకటో వార్డులో ఉన్న బాలికల ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వైపు రోడ్డు పక్కన మురుగునీరు నిలిచి దోమల వ్యాప్తి పెరిగింది. భరించలేని దుర్వాసన వస్తోంది. సఫాయోళ్లు సమ్మె చేస్తున్నారని చెప్పి ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడ రోగాలు వస్తయోనని భయపడ్తానం. రోగాల బారిన పడకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

పోతరాజు సమ్మక్క, కమలాపూర్

జాగ్రత్తలు పాటించాలి..



ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి ఆవరణలో నీరు నిల్వకుండా చూసుకోవాలి. కలుషితమైన నీటిని తాగడం ద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా బయట పదార్థాలను తినకుండా ఉండడం మంచిది. ఇంట్లో రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, పూలకుండీల్లోని నీటిలో వ్యాధికారక దోమలు వృద్ధి చెందుతుంటాయి. పాత టైర్లు, తాగేసిన కొబ్బరిబోండాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరుగుతాయి. దోమల వ్యాప్తిని నివారించగలిగితే వ్యాధులు సోకే అవకాశం ఉండదు.

\- సాంబశివరావు, హనుమకొండ డీఎంహెచ్‌ఓ

8 పోస్టులు.. 188 దరఖాస్తులు

- చైల్డ్‌లైన్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు
- పైరవీల జోరు.. అర్హుల్లో ఆందోళన

హన్మకొండ అర్బన్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే చైల్డ్‌లైన్ విభాగంలో 8 పోస్టులు భర్తీ చేయడానికి అధికారులు నోటిఫికేషన్ ఇస్తే ఏకంగా 188 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. పరిశీలన అనంతరం 112 దరఖాస్తులను అధికారులు ఆమోదించి అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలిచారు. కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ ఆధ్వర్యంలో ఎంపిక కమిటీ శనివారం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసింది. వివిధ కేటగిరీల్లో మెరిట్ ఆధారంగా మొత్తం 8 మందిని ఎంపిక చేయాల్సి ఉంది. త్వరలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేయనున్నారు. ఎంపిక కమిటీలో అదనపు కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ మధురిమ, బీసీ సంక్షేమ శాఖ డీడీ రాంరెడ్డి, జిల్లా సహకారశాఖ అధికారి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

పోటీ ఎక్కువగా..

8 పోస్టుల కోసం 112 మందిని ఇంటర్వ్యూలకు పిలవడంతో పోటీ ఎక్కువగా నెలకొంది. ఇంటర్వ్యూలు, మార్కులు, రిజర్వేషన్ మాత్రమే కాకుండా కొందరు పైరవీలను కూడా నమ్ముకున్నారు. ఇంటర్వ్యూల ప్రారంభానికి ముందు నుంచి పైరవీల జోరు పెరిగింది. రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు, ఉన్నతస్థాయి అధికారుల నుంచి నియామకాల విషయంలో అధికారులపై ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. ఇక తుది జాబితా వెలువడితే అధికారులు ఏమేరకు ఒత్తిళ్లకు తలొగ్గారన్న విషయం బయటపడుతుందని అభ్యర్థులు చర్చించుకుంటున్నారు.



కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు

ప్రావీణ్య.. గ్రీన్ ఇండియా చాలెంజ్

నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చేసిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య స్వీకరించారు. అందులో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో మొక్క నాటడంతోపాటు హనుమకొండ, మహబూబాబాద్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, శశాంక, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరారు.

\- కరీమాబాద్



పరిశోధనలతో ఉత్తమ ఫలితాలు

- హెల్త్ వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి
- కేఎంసీలో రీసెర్చ్ డే

ఎంజీఎం: విద్యార్థులు ప్రస్తుతం వస్తున్న జబ్బులపై పరిశోధన చేయడానికి క్లినికల్ వైద్యంతో పాటు రీసెర్చ్ దిశగా అడుగులు వేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కాళోజీ ఆరోగ్య వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ మెడికల్ కళాశాలలో యూఏఏ అల్యుమ్ని (పూర్వ విద్యార్థులు) శనివారం రీసెర్చ్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆరోగ్య వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 30 కళాశాలల నుంచి 50 మందిని ఆహ్వానించగా.. వీరికి పలు రంగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభను పరిశీలించారు. ఈసందర్భంగా కేఎంసీలోని ఎన్ఆర్ఐ హాల్‌లో రీసెర్చ్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, కళాశాల సెమినార్ హాల్స్‌లో గ్రూపు డిబేట్స్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వీసీ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అల్యుమ్ని ఎడ్యుకేషన్ కోచైర్మన్ డాక్టర్ సుజిత్, పున్నం, అనుపమ, వేణును అభినందించారు. అల్యుమ్ని కో–చైర్మన్ డాక్టర్ సుజిత్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు విదేశాలతో పోలిస్తే ఇక్కడ శిక్షణ పొందిన వైద్య నిపుణులు తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. ఈకార్యక్రమం యూజీ స్థాయిలోనే పరిశోధనలు చేయాలనే ఆలోచన రేకెత్తించి విద్యార్థులను లక్ష్యసాధన దిశగా అడుగులు వేసేలా ముందుకు తీసుకెళ్తుందన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్, హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హెల్త్ వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి

చట్టాలపై అవగాహన ఉండాలి

హనుమకొండ జిల్లా జడ్జి శ్రావణ స్వాతి

ధర్మసాగర్: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా జడ్జి శ్రావణ స్వాతి అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో హనుమకొండ జిల్లా న్యాయ సహాయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఏమైనా లీగల్ సమస్యలు వస్తే.. పేదరికంతో తమ పక్షాన వాదించడానికి న్యాయవాదిని పెట్టుకోలేని స్థితిలో ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వమే న్యాయవాదిని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. యువత మహిళలపై దురుసుగా ప్రవర్తించినా, ర్యాగింగ్‌కు పాల్పడినా, వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు పోషించకుండా ఇబ్బందులకు గురిచేసినా.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలు, లీగల్ సమస్యలపై అవగాహన కల్పించారు. సదస్సులో సీఐ ఒంటేరు రమేశ్, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, ఉపసర్పంచ్ పుండ్రు శివాకర్ రెడ్డి, ఎంపీటీసీ ఆకారపు నాగయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

- వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే
- ఒంటిమామిడిపల్లిలో బీఎల్‌ఓలకు శిక్షణ

ఐనవోలు: ఓటరు జాబితా తయారీలో బీఎల్‌ఓలదే కీలకపాత్ర అని వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌ఓలకు అర్థమయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని ట్రెయినర్లకు సూచించారు. బూత్ స్థాయిలో ఓటర్ల నమోదు, సవరణ, జాబితా సరిగా రూపొందిస్తే ఎన్నికల ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలు లేకుండా ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టాలని బీఎల్‌ఓలకు సూచించారు. శిక్షణ సమయంలో బీఎల్‌ఓలు కచ్చితమైన సమాచారం తెలుసుకోవాలని, అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, నియోజకవర్గస్థాయి ట్రినర్లు రమేశ్ చంద్ర, సురేష్‌బాబు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

- చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ పరిశీలన

హన్మకొండ : వర్షంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌ను కలెక్టర్ సిక్తాపట్నాయక్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, మున్సిపల్ అధికారులతో కలిసి చీఫ్‌విప్ శనివారం పరిశీలించారు. వరద నీరు బస్‌స్టేషన్‌లో చేరడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత వివరించారు. బస్‌స్టేషన్ చుట్టూ డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని, వరద నీరు సులువుగా వెళ్లే మార్గం లేక బస్‌స్టేషన్‌లోకి చేరుతోందని, బస్‌స్టేషన్ చుట్టూ ఉన్న డ్రెయినేజీని మెరుగు పరచాలని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్, కమిషనర్‌కు వివరించారు. స్పందించిన చీఫ్‌విప్ బస్‌స్టేషన్‌లోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతమున్న ఆర్టీసీ బస్‌స్టేషన్ స్థానంలో ఆధునిక, సాంకేతికతతో బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

భవనాల పరిశీలన..

హనుమకొండ అశోక్‌కాలనీలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలోకి వరద నీరు చేరింది. ప్రజలకు ఇబ్బందులు కలుగడంతో వేరే ప్రాంతానికి మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న యూత్ హాస్టల్ భవనంతోపాటు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్, కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా, ఆర్డీఓ, హనుమకొండ తహసీల్దార్‌తో కలిసి దాస్యం వినయ్‌భాస్కర్ పరిశీలించారు.



హనుమకొండ బస్‌స్టేషన్ ఆవరణలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్, కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా

ఎన్నికల నిర్వహణకు పార్టీలు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కలెక్టర్ సిక్తాపట్నాయక్

హన్మకొండ అర్బన్: సాధారణ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగాధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌ల మార్పునకు ఈ నెల 30వరకు అవకాశం ఉందన్నారు. ఈవీఎం, వీవీప్యాట్లపై కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రెండు మొబైల్ వాహనాల ద్వారా గ్రామాలు, వార్డుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన చోట ఈసారి ప్రత్యేక దృష్టి పెట్టి పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ రమేశ్, శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి ఈవీ శ్రీనివాస్‌రావు, బీజేపీ నుంచి రావు అమరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి రాంప్రసాద్, టీడీపీ నుంచి శ్యాంసుందర్ ఇతర పార్టీల ప్రతినిధులు ఉన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం అవగాహన సెంటర్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సందర్శించారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి : సీపీ



మాట్లాడుతున్న సీపీ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తించే సిబ్బంది సంక్షేమానికి కృషిచేస్తానని, వారికి నిరంతరం అందుబాటులో ఉంటానని పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ తెలిపారు. భీమారంలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్, హోంగార్డ్స్ సిబ్బందితో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నక్సల్స్ నియంత్రణలో వరంగల్ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్, టీఏ, బకాయిలు త్వరలోనే అందుకుంటారని ఆయన తెలిపారు. విధుల్లో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా అవకాశాన్ని బట్టి వెసులుబాటు కల్పించనున్నట్లు, ప్రతి నెలా సిబ్బంది సంక్షేమం కోసం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సిబ్బంది సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చే విధంగా విభాగాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. డాక్టర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యలతో మాట్లాడి రాయితీలు కల్పిస్తామని, 40 సంవత్సరాలు పైబడిన వారికి మాస్టర్ హెల్త్ చెకప్, ఆకస్మికంగా మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం కింద ఒక రోజు వేతన పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. హోంగార్డు సిబ్బందిి గ్రూపు ఇన్సూరెన్స్ కోసం సంబంధిత కంపెనీలతో మాట్లాడానని చెప్పారు. పరిపాలన విభాగం డీసీపీ పుష్పారెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ అధికారి అంకిత్, అదనపు డీసీపీలు సంజీవ, సురేష్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, ఏఓ ఆర్‌కే.స్వామి, ఆర్ఐలు చంద్రశేఖర్, నగేష్, భాస్కర్, సతీష్, కేయూ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, పోలీస్ అధికా రుల సంఘం ప్రతినిధి శోభన్, పరిపాలన విభాగం సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన సమీపం నుంచి తరలిపోతున్న వరదనీరు

గోదావరి పెరుగుతూ.. తగ్గుతూ

జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు పెరుగుతూ.. తగ్గుతూ ప్రవహిస్తున్నాయి. శనివారం సాయంత్రం కాళేశ్వరం పుష్కరఘాటు వద్ద 11.150మీటర్లు ఎత్తులో నీటి మట్టం ప్రవహిస్తోంది. ఎగువన గోదావరి, ప్రాణహిత నదుల గుండా వరద అర్ధరాత్రి నుంచి పెరిగి శనివారం ఉదయం 10గంటల వరకు 11.520మీటర్లు ఎత్తులో ప్రవహించింది. తరువాత తగ్గుతూ సాయంత్రం 6గంటల వరకు 11.150మీటర్లకు చేరింది. ఎగువ తెలంగాణ, మహారాష్ట్రల నుంచి వరద నీరు తరలి వచ్చి కాళేశ్వరం మీదుగా దిగువన మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వైపునకు తరలిపోతోంది.

- కాళేశ్వరం

పోలీస్ శాఖలో ఎన్నికల ఎఫెక్ట్



- ఉన్నతాధికారుల బదిలీ
- భారీగా ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్
- నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు!
- బదిలీలకు ఈనెల 31 టార్గెట్

వరంగల్ క్రైం: పోలీసుశాఖలో బదిలీలు భారీగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి అనధికారికంగా ప్రారంభమైంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీసీపీ స్థాయి అధికారి నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్ అధికారి వరకు ఎన్నికల ఎఫెక్ట్‌లో భాగంగా బదిలీలు జరుగుతున్నాయి. జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనరేట్ల కమిషనర్లు, ఎస్పీలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు. దీంతో ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. దీనికి అనుగుణంగా ఎన్నికల సమయంలో కీలకపాత్ర పోషించే పోలీస్ శాఖలో భారీగా మార్పులు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారుల ఎంపిక విషయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు మార్గ నిర్దేశం చేసినట్లు సమాచారం. దానికి అనుగుణంగా ఎన్నికల నిబంధనలు వర్తించే పోలీస్ అధికారులను ఆయా నియోజక వర్గాలకు సాగనంపుతున్నారు. దీంతోపాటు ఎన్నికల సమయంలో సామాజిక సమీకరణాలతో పాటు ఏమేరకు ఎన్నికల విధుల్లో ఉపయోగపడుతారనే కోణంలో క్షుణంగా పరిశీలించిన తర్వాతనే పోస్టింగ్‌లకు సిఫార్సు చేస్తున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల బదిలీ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేసే ఇద్దరు డీసీపీలు పుల్లా కరుణాకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా, కర్రి పుష్పారెడ్డి తెలంగాణ కమాండ్ కంట్రోల్ విభాగం ఎస్పీగా బదిలీ అయ్యారు. వీరితో పాటు పరకాల, కాజీపేట, మామునూరు, క్రైం, ఏసీపీలు బదిలీ అయ్యారు. ఇన్‌స్పెక్టర్లు.. పరకాల, గీసుకొండతో పాటు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. దీంతోపాటు చాలా కాలంగా ఖాళీగా ఉన్న హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లకు ఖమ్మం, కొత్తగూడెం నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు కేటాయించారు. కోడ్ ఎఫెక్ట్‌లో భాగంగా సుబేదారిలోని రూరల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, భరోసా ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. గత నాలుగైదు రోజుల్లో వరుసగా సబ్ ఇన్‌స్పెక్టర్లను వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు!

ఎన్నికల ముందు ప్రశాంతత కోసం కొంత మంది అధికారులు లూపులైన్ల కోసం ప్రయత్నాలు సాగిస్తుండగా.. మరికొంత మంది ఎన్నికల కోడ్ వర్తించని చాలామంది అధికారులు సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈసమయంలో నాయకులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఏమేరకు ఉపయోగపడతారని వారి అనుచర గణంతో లెక్కలు వేసుకుంటున్నారు. అధికారి పనితీరుతో పాటు సామాజిక అంశాన్ని ప్రధానంగా చూస్తున్నారు. ఒక్కో పోస్టింగ్ కోసం పదుల సంఖ్యలో అధికారులు క్యూ కట్టడం విశేషం. ఏసీపీ పోస్టుల కోసం కూడా అధికారులు ఒక్కో ప్రజాప్రతినిధిని పలుమార్లు కలుస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న కొంత మంది అధికారులు వారి పీరియడ్ పూర్తి కాకపోయినప్పటికీ పోస్టింగ్ ఉంటుందో? ఊడుతుందో.. తెలియని అయోమయ స్థితిలో ఉద్యోగం నెట్టుకొస్తున్నారు. వరంగల్ సబ్ డివిజన్‌లో మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ వర్ధన్నపేట, ధర్మసాగర్, కమలాపూర్, నర్సంపేట, రఘునాథపల్లి, నర్సంపేట రూరల్, నర్మెట్ట పోలీస్‌స్టేషన్లకు కొత్త అధికారులు రానున్నారు. ఈపోస్టింగ్‌ల కోసం ఇప్పటికే చాలా మంది అధికారులు ప్రజాప్రతినిధుల నుంచి లెటర్లు పోలీస్‌బాస్‌కు అందించినట్లు సమాచారం. ఇందులో కొంత మందికి ఎలక్షన్ ఎఫెక్ట్ ఉండగా.. మరికొంత మంది ప్రవర్తన సరిగ్గా లేక మార్పు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

అరెస్టులకు రంగం సిద్ధం!

పోలీసు అధికారుల లెక్కల ప్రకారం వివిధ కేసుల్లో ఇప్పటి వరకు అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న సుమారు 180 మంది నిందితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. వీరిని అరెస్ట్ చేయడానికి ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఎస్‌హెచ్‌ఓలకు నిర్దిష్టమైన ఆదేశాలు అందాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపనున్నారు. దీంతో పాటు ఆయా పోలింగ్‌స్టేషన్ల వారీగా మాజీలతో పాటు గతంలో జరిగిన ఎన్నికల్లో ఇబ్బదులు సృష్టించిన వ్యక్తుల జాబితాలు కూడా ఆయా పోలీస్‌స్టేషన్లలో సిద్ధంగా ఉన్నాయి.

తుపాకుల జాబితా రెడీ..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తుపాకుల లైసెన్స్‌లు 230 ఉన్నాయి. ప్రస్తుతం తుపాకుల లైసెన్స్ కలిగిన వ్యక్తులు వివిధ గొడవల్లో చిక్కుకున్న, కేసులు నమోదైన వారి లైసెన్స్‌లు రద్దు చేశారు. దీంతో కమిషనరేట్ పరిధిలో 180 వరకు లైసెన్స్ తుపాకులున్నాయి. ఎన్నికల ముందు వీటిని ఆయా పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. తుపాకుల లెక్కలను సైతం పోలీసు అధికారులు సిద్ధం చేసి ఉంచారు.

ఈనెల 31 వరకు ప్రక్రియ పూర్తి చేస్తాం..



కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈనెల 31 వరకు ఎన్నికల బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తాం. సొంత జిల్లా, సొంత నియోజవర్గం ఉన్న అధికారులతో పాటు చివరి నాలుగేళ్లలో మూడు సంవత్సరాలు ఒకే దగ్గర పనిచేసే అధికారులను నిబంధనల ప్రకారం బదిలీ చేస్తాం. ప్రస్తుతం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న అధికారులను రెవెన్యూ జిల్లాను ప్రతిపాదికన బదిలీలు చేపడుతున్నాం. ఏసీబీ, క్రిమినల్ కేసులు ఉన్న అధికారులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతాం.

- ఏవీ.రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గం
- యూఎస్పీఎస్సీ రాష్ట్ర బాధ్యుడు కడారి భోగేశ్వర్



కాశిబుగ్గ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న యూఎస్‌పీఎస్సీ బాధ్యులు

కాశిబుగ్గ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఏకైక మార్గమని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీఎస్సీ) రాష్ట్ర బాధ్యుడు కడారి భోగేశ్వర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలకు నిరసనగా సమితి వరంగల్, ఖిలా వరంగల్ బాధ్యులు కాశిబుగ్గ జంక్షన్ నుంచి శంభునిపేట వరకు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. బ్లాక్ చేసిన 13 జిల్లాలో స్పౌజ్ బదిలీలు చేపట్టాలని సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టే నూతన విద్యావిధానం రద్దు చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి జూలై 1నుంచి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. అలాగే, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి ఇంగ్లిష్ మీడియం కోసం ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని తెలిపారు. అంతకుముందు మణిపూర్‌లో మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కాశిబుగ్గ జంక్షన్‌లో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీఎస్సీ బాధ్యులు తాటికాయల కుమార్, వెంకట్‌రెడ్డి, పూజారి మనోజ్, స్వామి, గోవిందరావు, నరసింహులు, అజయ్‌బాబు, పూర్ణచందర్, రమేష్, అశోక్, కనకస్వామి, రవీందర్, సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడిన కేయూ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 20, 21, 22వ తేదీల్లో వాయిదా పడిన వివిధ పరీక్షల రీషెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక.. శనివారం విడుదల చేశారు. వాయిదాపడిన బీ ఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27న , 22న జరగాల్సిన పరీక్షలు ఆగస్టు 1న , బీ ఫార్మసీ 7 సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న నిర్వహిస్తారు. ఫార్మ డీ మూడో సంవత్సర పరీక్షలు ఆగస్టు 9న , ఫార్మ డీ నాలుగో సంవత్సర పరీక్షలు ఆగస్టు 10వ తేదీన, ఫార్మ డీ 5వ సంవత్సర పరీక్షలు ఆగస్టు 8వ తేదీన నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

బీటెక్ (సీబీసీఎస్)

కేయూ పరిధిలో వాయిదాపడిన బీటెక్ సీబీసీఎస్ పరీక్షల వివరాలు ఇలా ఉన్నాయి. బీటెక్ రెండో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24న, బీటెక్ మూడో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25న నిర్వహిస్తారు.

బీటెక్ (నాన్ సీబీసీఎస్)పరీక్షలు ఇలా..

బీటెక్ మొదటి సంవత్సర పరీక్షలు ఈనెల 26న, బీటెక్ నాలుగో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26న, బీటెక్ మూడో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న , బీటెక్ మూడో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 31న, బీటెక్ రెండో సంవత్సర మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1న, బీటెక్ రెండో సంవత్సర రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు1న నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. మిగతా పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

ఫాదర్ కొలంబో కలలు సాకారం..

- ఇటలీ పోప్ దూత, భారత్–నేపాల్ రాయబారి లియోపోల్డో జిరెల్లి



ఫాదర్ కొలంబో వైద్యకళాశాల ప్రాంగణంలో భూమి పూజ చేస్తున్న పోప్‌దూత లియోపోల్డో జిరెల్లి, ముంబయి, గోవా, కార్డినల్స్, ఓరుగల్లు పీఠాధిపతి ఉడుముల బాల

కాజీపేట రూరల్: పేదల ఆరాధ్యుడు ఫాదర్ కొలంబో కలలు సాకారం కావడం సంతోషంగా ఉందని ఇటలీ పోప్ దూత, భారత్, నేపాల్ రాయబారి లియోపోల్డో జిరెల్లి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్ బ్రిడ్జి సమీపంలో గల కొలంబో వైద్యశాల ప్రాంగణంలో శనివారం ఫాదర్ కొలంబో వైద్యవిద్యా కళాశాల ఆశీర్వాద వేడుక, బీఎస్సీ నర్సింగ్ విద్య, పారా మెడికల్ కళాశాలల భూమి పూజకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలంబో వైద్యకళాశాల వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రాత్రి జరిగిన దివ్య బలిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముంబయి కార్డినల్ ఒస్వాల్డ్ గ్రాషియాస్ మాట్లాడుతూ దేశంలో మణిపూర్ ఘటనలు పునరావృతం కావొద్దన్నారు. దేశంలో మానవులు అందరూ సమానులేనని, ఒకరిపట్ల ఒకరు ప్రేమతో ఉండేలా క్రీస్తును ఆరాధించాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఫాతిమానగర్ బిషప్ హౌజ్ ప్రాంగణం నుంచి వరంగల్ మెడికేర్ ఆస్పత్రి వరకు లియోపోల్డోను ప్రత్యేక కారులో ర్యాలీగా తీసుకెళ్లారు. వరంగల్, ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోడా డామన్ కార్డినల్ పిలిప్పెరి పెర్రావో, ఏలూరు, కడప, విజయవాడ, బెల్లారి, శ్రీకాకుళం, శంషాబాద్ పీఠాధిపతులు పొలిమెర జయరావు, గాలిబాల, టి.జోసెఫ్‌రాజారాం, హెన్నిడిసౌజ, ఆర్.విజయ్‌కుమార్, రాపెల్ తట్టల్, మెడికేర్ ఆస్పత్రి డైరెక్టర్ చిన్నప్ప, ఫాదర్ జో సెఫ్, కొలంబో వైద్య శాల నిర్వాహకులు, ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి ఫాదర్లు, సిస్టర్లు, బ్రదర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రవాహ పరవళ్లు..



అన్నారం బ్యారేజీలో గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు



సమ్మక్క సాగర్ వద్ద తరలుతున్న నీరు

- కాళేశ్వరం బ్యారేజీలకు భారీగా వరద నీరు
- లక్ష్మీలో 75, సరస్వతీబ్యారేజీలో 35గేట్లు ఎత్తివేత

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం(సరస్వతి)బ్యారేజీలకు వరద నీరు పోటెత్తింది. దీంతో శనివారం ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆయా బ్యారేజీల్లో గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, నాలుగు రోజుల నుంచి గోదావరి, ప్రాణహిత నదులకు వరద పోటెత్తుతోంది. ఫలితంగా కాళేశ్వరం వద్ద 11.150మీటర్ల ఎత్తులో నీటిమట్టం కొనసాగుతోంది.

35గేట్లు ఎత్తివేత:

ఎగువన ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో గేట్లు ఎత్తడంతో గోదావరి గుండా దిగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం (సరస్వతి) బ్యారేజీకి వరద తాకిడి మూడు రోజుల నుంచి పెరిగింది. ఆ బ్యారేజీలో మొత్తం 66 గేట్లు ఉండగా 35 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. గోదావరి నుంచి ఇన్‌ఫ్లో 2,25,000లక్షల క్యూసెక్కులు తరలి రాగా, గేట్లు ఎత్తడంతో దిగువకు కాళేశ్వరం వైపునకు 1,03,500లక్షల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో తరలి దిగువకు వెళ్తున్నాయి. బ్యారేజీ సామర్థ్యం 10.87 టీఎంసీలకు గాను ప్రస్తుతం 2.36 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి తరలివచ్చే నీరు దిగువన కాళేశ్వరం చేరుతోంది.

లక్ష్మీబ్యారేజీ 75 గేట్లు ఎత్తివేత

ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది, అటు గోదావరి నదుల ప్రవాహాలు కలిసి భారీ స్థాయిలో వరద నీరు లక్ష్మీబ్యారేజీకి చేరుతోంది. దీంతో ఇన్‌ఫ్లో 6,10,250లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తోంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజీలో మొత్తం 85గేట్లు ఉండగా 75 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. అవుట్‌ఫ్లో 6,10,250 లక్షల క్యూసెక్కులు దిగువకు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఉధృతిని ఇంజనీరింగ్ అధికారులు సమీక్షిస్తున్నారు.

సమ్మక్క సాగర్ వద్ద ..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. ఉదయం బ్యారేజీ వద్ద 825380 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 879450 క్యూసెక్కులకు చేరింది. దీంతో అదే స్థాయిలో బ్యారేజీలో ఉన్న 59 గేట్లను ఎత్తి దిగువకు 87450 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం 82.5 మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది.

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మొగుళ్లపల్లిలో ఘటన



దుర్గేశం (ఫైల్)

మొగుళ్లపల్లి: బంధువు అంత్యక్రియలకు బయలుదేరిన ఓ వ్యక్తి.. అనంతలోకాలకు వెళ్లాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి దుర్గేశం (53) మండల కేంద్రంలోని తన బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భార్య ప్రభావతితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో మొగుళ్లపల్లి పెద్దవాగు బ్రిడ్జి వద్ద మలుపు తిరుగుతున్నాడు. చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో మండల కేంద్రం మీదుగా జమ్మికుంటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దుర్గేశం దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో దుర్గేశం మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన ప్రభావతిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు.